క్లుప్తంగా

భవిష్యత్‌కు పూనాది వేసుకోవాలి



మరికల్: భవిష్యత్‌లో ఉన్నత స్థాయిలో స్థిరపడాలంటే విద్యార్థులు వారి భవిష్యత్‌కు మంచి పూనాది వేసుకోవాలని కరస్పాండెంట్ కె. రాములు, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సరస్వతీ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలను సాధించవచ్చాన్నారు. పోటీ ప్రపంచంలో పోటీపడి చదివిన వారే భవిష్యత్‌లో స్థిరపడతారన్నారు. అనంతరం విద్యార్థులు వివిధ సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం పాల్గొన్నారు.

మాదాసి కుర్వ ఆత్మీయ సమ్మేళనం



ఊట్కూరు: మండలంలోని బీజేపీ ఆధ్వర్యంలో శనివారం మాదాసి కుర్వ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ మేరకు.. మాదాసి కుర్వ నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు కుర్వ రంజిత్‌కుమార్ మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాదాసి కుర్వలను ఎస్సీ జాబితాలో చేరుస్తామని మోసం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ సైతం హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ఊసెత్తడం లేదని అన్నారు. కుర్వ కులస్తులు బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే. అరుణ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, సర్పంచ్ కుర్వ హన్మంతు, నాయకులు కుర్వ నర్సింహ, ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.

‘పాలమూరు’కు జాతీయ హోదా మాటేమిటీ..?



నారాయణపేట: తొలిసారిగా ప్రధాని మోదీ శుక్రవారం జిల్లాకు వచ్చినా పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదాపై ఎలాంటి హామీ ఎందుకు ఇవ్వలేదని, జిల్లా అభివృద్ధి వరాలజల్లు కురిపిస్తారు అనుకుంటే కేవలం మాటలు తప్పా ఏ హామీ ఇవ్వలేదని మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2019లో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని మాటిచ్చిన ప్రధాని దాని ఊసెత్తలేదని, సైనిక్ స్కూల్, క్రిష్ణ, వికారాబాద్ రైల్వే లైన్‌పై ఎలాంటి ప్రకటన చేయకపోవడం హాస్యాస్పదమన్నారు. ఇక మక్తల్ సభలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి సైతం జిల్లాపై స్పష్టత ఇవ్వలేదని, కానుకుర్తి, గార్లపాడు, కోటకొండను మండలాలుగా ప్రకటిస్తామని చెప్పి నేటికీ మాటలకే పరిమితమైందన్నారు. జిల్లాను తొలగిస్తే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

ప్రశ్నించే గొంతుకను పార్లమెంట్‌కుపంపిద్దాం

నారాయణపేట రూరల్: బీఆర్‌ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి ఓటువేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోటకొండలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. సిట్టింగ్ ఎంపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేపూరి రాములు, జెడ్పీటీసీ అంజలి, ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం దుకాణాల బంద్

మహబూబ్‌నగర్ క్రైం: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా శనివారం సాయంత్రం 5గంటల నుంచి ఈనెల 13న సాయంత్రం వరకు జిల్లాలో ఉన్న మద్యం దుకాణాలు మూత పడనున్నాయి. పోలింగ్ జరుగుతున్న రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండటానికి ఎన్నికల నిబంధనల ప్రకారం 48గంటల పాటు లిక్కర్ షాప్‌లు మూయిస్తారు. కాగా ఒకవైపు పోలీసులు, మరోవైపు ఆబ్కారీ పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తున్నా ఆయా నియోజకవర్గాలకు మద్యం సరఫరా అవుతోంది. ప్రతిరోజు గ్రామాల వారీగా నాయకులు మద్యం, మాంసంతో విందు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోనే ఏకంగా ఇళ్లలోనే మద్యం నిల్వలు ఉంచి ఓటర్లకు రాత్రి సమయంలో పంపిణీ చేస్తున్నారు. ఎక్సైజ్ అధికారుల ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ అక్రమ మార్గాల్లో ఇతర రాష్ట్రాల నుంచి సైతం మద్యం కాటన్లను భారీ గా జిల్లాకు దిగుమతి చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. కాగా పక్కా సమాచారంతో నెలరోజులుగా ఎక్సైజ్ పోలీసులు దా డులు చేసి రూ. లక్షల విలువ చేసే మద్యం స్వాధీనం చేసుకున్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- 927 పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ క్యాస్టింగ్
- పోలింగ్ కేంద్రాల వద్ద కనీస సౌకర్యాల ఏర్పాటు
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ జి.రవినాయక్



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పోలింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రవినాయక్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 13న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కేంద్రానికి చేరుకొని క్యూలైన్‌లో ఉన్న వారందరికి ఓటుహక్కు వినియోగించుకునే అవకాశముందన్నారు. ఇప్పటికే 95 శాతం ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయినట్లు వివరించారు. ఎన్నికల కమిషన్ గుర్తించిన 12 రకాల గుర్తింపు కార్డులలో దేనినైనా చూపించి ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు. పార్లమెంటు పరిధిలోని 7 నియోజకవర్గాల పరిధిలో మొత్తం 16,82,470 మంది ఓటర్లు, 1,239 మంది సర్వీస్ ఓటర్లు ఉండగా ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1937 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 937 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 214 మంది సెక్టార్‌ల పరిధిలోని సెక్టార్ ఆఫీసర్ల ద్వారా ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఎన్నికల నియమాల ప్రకారం వాహనాల తనిఖీల్లో రూ.2.46 కోట్ల నగదు, రూ.1.81 కోట్ల విలువ చేసే 45,069 లీటర్లు మద్యం స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు. అందులో ఆధారాలు చూపిన రూ.2.19 కోట్ల డబ్బును రిలీజ్ చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం 31 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారని రెండు బ్యాలెట్ యూనిట్లను ఏర్పాటు చేసి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు వివరించారు. పోలింగ్‌కు 72 గంటల ముందు నుంచే అంతర్ జిల్లా చెక్‌పోస్టులను మరింత యాక్టివ్ చేసినట్లు తెలిపారు. 48 గంటల ముందు నుంచి సైలెన్స్ పీరియడ్‌లో అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలులోకి వచ్చినట్లు వివరించారు. శనివారం సాయంత్రం 6 గంటల తర్వాత అన్ని ప్రచారాలు, లౌడ్ స్పీకర్లు నిషేదించినట్లు తెలిపారు. ఎస్పీ హర్షవర్ధన్ మాట్లాడుతూ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉందని, సైలెన్స్ పీరియడ్‌లో నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. పార్లమెంటు పరిధిలో మొత్తం 881 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా గుర్తించి ఐటీబీపీ సెంట్రల్ ఫోర్స్ ద్వారా భద్రత కల్పించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే హెల్ప్‌లైన్ 08542-1950 నంబర్‌కు సమాచారం ఇవ్వవచ్చన్నారు.

మూడో ర్యాండమైజేషన్ పూర్తి

పార్లమెంటు ఎన్నికల నిర్వహణలో భాగంగా కేంద్రం ఎన్నికల సంఘం సాధారణ పరిశీలకులు షెవాంగ్ గ్యాచో భూటియా సమక్షంలో పోలింగ్ సిబ్బంది మూడో ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. శనివారం కలెక్టరేట్‌లో ఎన్ఐసీ సమావేశ మందిరంలో ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాలకు పోలింగ్ సిబ్బందిని కేటాయించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ జి.రవినాయక్, నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అదేవిధంగా నారాయణపేట, మక్తల్, నియోజకవర్గాలకు సంబంధించి పోలింగ్ సిబ్బంది, సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ నిర్వహించి పోలింగ్ కేంద్రాలకు కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐసీడీఐఓ ఎం.ఎస్‌మూర్తి, మ్యాన్‌పవర్ నోడల్ అధికారి ప్రవీణ్ పాల్గొన్నారు.

పీయూలో కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్‌రూంల పరిశీలన..

పాలమూరు యూనివర్సిటీ లో ఏర్పాటు చేస్తున్న ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు పనులను ఎన్నికల సాధారణ పరిశీలకులు షెవాంగ్ గ్యాచో భూటియా, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి.రవి నాయక్‌తో కలిసి శనివారం పరిశీలించారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పలు సూచనలు చేశారు. లెక్కింపు టేబుళ్ల కూర్పు, అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్ల ప్రవేశం, ఈవీఎం కదలికలపై సూచనలు ఇచ్చారు. ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి పరిశీలకులకు వివరించారు. అదేవిధంగా ఎన్నికల ఏర్పాట్లలో బాగంగా మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ మెటీరియల్ పంపిణీ కోసం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సాధారణ ఎన్నికల పరిశీలకులు షెవాంగ్ గ్యాచో భూటియా, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవినాయక్‌లు శనివారం పరిశీలించారు. ఆదివారం పంపిణీ చేయనున్న మెటీరియల్ విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



పీయూలో కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న సాధారణ ఎన్నికల పరిశీలకులు షెవాంగ్ గ్యాచో భూటియా

ఎన్నికల నిబంధనలు పాటించాలి

- రాజకీయ పార్టీల నాయకులు సభలు, సమావేశాలు నిర్వహించొద్దు
- ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నిస్తే చర్యలు
- అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్

నారాయణపేట: అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం సాయంత్రం వరకు ఎన్నికల ప్రచారానికి తెర పడిందని, ఇక సభలు, సమావేశాలు నిర్వహించరాదని, ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ఎవరైనా మద్యం, డబ్బు, గిఫ్టులు ఇచ్చినట్లు పక్కా సమాచారం ఉంటే జిల్లా కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం, సి విజిల్ కు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. పోలింగ్ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలోనే ఎంతో పారదర్శకంగా నిర్వహించనున్నట్లు, ముగిసిన తర్వాత ప్రొసీడింగ్ అధికారి రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏజెంట్లకు ఎన్ని ఓట్లు పోలయ్యాయి? పోలింగ్ శాతం వివరాలతో ఒక ధ్రువీకరణ పత్రం ఇస్తారన్నారు. మళ్లీ ఓట్ల లెక్కింపు రోజు(జూన్ 4)న ఆ పత్రంతో పార్టీల నాయకులు కౌంటింగ్ కేంద్రానికి వస్తే వారి సమక్షంలోనే ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించడం జరుగుతుందన్నారు.

స్ట్రాంగ్‌రూం నుంచి సామగ్రి పోలింగ్ కేంద్రాలకు..

కాగా ఆదివారం ఉదయం 7 గంటలకు జిల్లా కేంద్రంలోని శ్రీ దత్త బృందావన్ బీఈడి కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్ నుంచి ఇవిఎం, వీవీ ప్యాట్ మిషన్లను రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలోనే బయటికి తీసి డిస్ట్రిబ్యూట్ కేంద్రం వద్ద నుంచి పోలింగ్ కేంద్రాలకు తరలించడం జరుగుతుందని ఆయన చెప్పారు. పోలింగ్ ముగిసిన తర్వాత మరుసటి రోజు 14న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్లో ఎన్నికల అబ్జర్వర్ పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన డాక్యుమెంట్‌ను అన్ని పార్టీల ప్రతినిధులకు చూపిస్తారని వివరించారు. సమావేశంలో ఆర్డీఓ మధుమోహన్, డీపీఆర్ఓ ఎం.ఏ. రషీద్, ఆయా పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

నారాయణపేట రూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, 18ఏళ్లు నిండి ఓటు హక్కు కల్గిన ప్రతి ఒక్కరూ తమ ఓటును తప్పకుండా వేయాలని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓటింగ్‌శాతం పెంచాల్సిన బాధ్యత సమాజంలో విద్యావంతులైన ఉపాధ్యాయులపై ఎంతైన ఉందన్నారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఓటు వేసేందుకు సమయం పెంచారని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు ఆలోచించి ఓటు వేయాలని కోరారు.

శాంతియుత ఎన్నికల నిర్వహణే లక్ష్యం



పోలీసులకు సూచనలు చేస్తున్న ఎస్పీ యోగేష్‌గౌతమ్

నారాయణపేట: జిల్లాలో స్వేచ్ఛాయుత వాతావరణంలో లోక్‌సభ ఎన్నికలు జరిగేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని, సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉంటూ బాధ్యతగా పనిచేయాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని జిపి శెట్టి ఫంక్షన్ హాల్లో ఎన్నికల విధులు, విధివిధానాలు, శాంతిభద్రతల పరిరక్షణ, భద్రత పరమైన ఎస్పీ సూచనలు చేశారు. ఎన్నికలకు మొత్తం 1300 మంది పోలీసులతో 296 పోలింగ్ లొకేషన్లలో, 553 పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. మూడు రోజుల పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వీధుల గురించి వివరించారు. పోలింగ్ కేంద్రం చుట్టూ 100 మీటర్ల వరకు ఎవరిని అనుమతించరాదని, ఓటు వేసేందుకు వచ్చే వారితో సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఏదైనా పోలింగ్ కేంద్రం వద్ద శాంతిభద్రతల సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించి వాటిని నివారించేందుకు రూటు ఆఫీసర్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారులను కేటాయించడం జరిగిందన్నారు. ఏఎస్పీ నాగేంద్రుడు, కమాండెంట్‌లు సురేష్, రాజ్‌బీర్ సింగ్, డీఎస్పీలు ఎన్ లింగయ్య, మహేష్ పాల్గొన్నారు.

జిల్లాలో 144 సెక్షన్ అమలు

ఎన్నికల సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలకు సంబంధించి ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా శనివారం నుంచి 14 సాయంత్రం 6:00 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు. నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుంపులు గుంపులుగా తిరగవద్దని, ఎవరైనా ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే సీవిజిల్ యాప్‌లో కానీ, డయల్ 100 కి కానీ దగ్గరలోని పోలీస్ స్టేషన్ వారికి కానీ సమాచారం ఇవ్వాలని తెలిపారు.

‘బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలి’

మక్తల్: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నే శ్రీనివాస్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో పురవీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ నర్సింహాగౌడ్, రాజేష్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకుడు రాజుల ఆశిరెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, లలితముదిరాజ్, జయనంద్ పాల్గొన్నారు.



మక్తల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మరికల్: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నే శ్రీనివాస్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని శనివారం పార్టీ నాయకులు మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో తిరుపతయ్య, అనంతర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జగదీష్, బాలకిష్ట, నర్సింహు పాల్గొన్నారు.

కృష్ణా: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నే శ్రీనివాస్ రెడ్డిని భారీమెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు రాజుల ఆశిరెడ్డి ఓటర్లను కోరారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శివరాజ్‌పాటిల్, మాలాలి, తిప్పయ్య, జగదీష్‌గౌడ, శంకర్, పాల్గొన్నారు.



దామరగిద్దలో..

దామరగిద్ద: బూటకపు హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుదామని మండల అధ్యక్షుడు సుభాష్, ఎంపీపీ నర్సప్ప అన్నారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ చివరి రోజు ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసే ఎంపీ అభ్యర్థి మన్నే శ్రీనివాస్ రెడ్డిని గెలిపించుకుందామని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు సీఎస్ఎస్ రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్దూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం చేస్తూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పథకాలను, వివరిస్తూ ప్రచారం చేశారు

వడ్లు క్వింటా రూ.2,455

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం వడ్లు (సోన) క్వింటా గరిష్టంగా రూ.2,455, కనిష్టంగా రూ.1,681 ధర పలికాయి. అలాగే, వడ్లు హంస గరిష్టంగా రూ.1,850, కనిష్టంగా రూ.1,740, చింతపండు గరిష్టంగా రూ.5,309, కనిష్టంగా రూ.4వేలు, జొన్నలు గరిష్టంగా రూ.4,666, కనిష్టంగా రూ.2,199, పెసర గరిష్టంగా రూ.8,003, కనిష్టంగా రూ.6,608 ధర పలికాయి.

కాంగ్రెస్‌వి నమ్మకం లేని పథకాలు



మద్దూరులో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు నాగురావునామాజీ

నారాయణపేట: దేశ ప్రగతికి దిక్సూచి.. ప్రపంచ దేశాలకే ఆదర్శం ప్రధాని మోదీ అని బీజేపీ రాష్ట్ర నేత నాగూరావు నామాజీ అన్నారు. శనివారం జిల్లా కేంద్రం నారాయణపేట మున్సిపాలిటీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతిఒక్కరూ కుటుంబ సమేతంగా కమలం పార్టీని ఆదరించాలని, డీకే అరుణకు అఖండ మెజార్టీతో ఎంపీగా గెలిపించాలని ఓటర్లను కోరారు. కుమ్మరివాడలో కుండ తయారుచేసి ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సిద్ది వెంకట్రాములు, గౌరి శంకర్, దామోదర్ గౌడ్, కేదార్ తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం జరిగిన ప్రధాని మోదీ బహిరంగ సభకు అశేష జనం తరలిరావడంతో దిగ్విజయం అయ్యిందన్నారు. సభను విజయవంతం చేసిన కార్యకర్తలకు మహిళలకు, బహిరంగ సభ బందోబస్తు ఏర్పాటు చేసిన అధికారులు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మద్దూరు: ఎంపీ అభ్యర్థి అరుణను గెలిపించి దేశంలో మోదీ నాయకత్వాన్ని బలపర్చాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగురావు నామాజీ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పడుగాకుల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రతన్‌పాండురెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.. ఈ సారి అరుణమ్మ గెలువడం, ఈ ప్రాంతం మరింత అభివృద్ధి జరగడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు మదన్, శంకర్, వెంకటయ్య, సాయిలు పాల్గొన్నారు.

మక్తల్: ఎంపీ అభ్యర్థి డీకే. అరుణను భారీమెజార్టీతో గెలిపించాలని డీకే అరుణ సోదరి సురేఖ ఓటర్లను అభ్యర్థించారు. శనివారం పట్టణంలోని ఆమె బీజేపీ తరఫున ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ పావని, వైస్ చైర్మన్ అఖిల రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ కర్నిస్వామి, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, ప్రసన్నరెడ్డి, కౌసల్య, రాజశేఖర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మంజూనాథ్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక..




పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీకే. అరుణ

నారాయణపేట: జిల్లాకు చెందిన టీడీపీ పార్లమెంట్ ప్రచార కార్యదర్శి, పేట అసెంబ్లీ ఇన్‌చార్జి వినయమిత్ర యాదవ్ ఆయన అనుచరులతో శనివారం పాలమూరు జిల్లా కేంద్రంలో డీకే అరుణ సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనకు డీకే. అరుణ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వినయ్‌మిత్ర మాట్లాడుతూ.. డీకే. అరుణ గెలుపునకు చిత్తశుద్ధితో పని చేస్తామన్నారు.

మోదీ సభ విజయవంతం

జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన ప్రధాని మోదీ ఎన్నికల ప్రచార సభ దిగ్విజమైయిందని జిల్లా బీజేపీ అధ్యక్షుడు పగుడాకుల శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. సభను విజయవంతం చేసిన ప్రజలకు, సహకరించిన రెవెన్యూ, పోలీస్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



మక్తల్‌లో..

నర్వ: నరేంద్ర మోదీ సారథ్యంలో బీజేపీ గెలుపును ఎవరు ఆపలేరని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి డీకే. అరుణ గెలుపునకు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కుర్వ సత్యం, నరేందర్‌రెడ్డి, రవికుమార్ రెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డిపాల్గొన్నారు.

జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా క్రికెట్ క్రీడాకారులు అంతర్జాతీయస్థాయికి ఎదగాలని ఎండీసీఏ చీఫ్ ప్యాట్రన్ వి.మనోహర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం పిల్లలమర్రి సమీపంలోని ఎండీసీఏ మైదానంలో హెచ్‌సీఏ సమ్మర్‌క్యాంప్‌లో భాగంగా శనివారం సీనియర్ జట్ల మధ్య మ్యాచ్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను మనోహర్‌రెడ్డి పరిచయం చేసుకొని మాట్లాడారు. జిల్లా క్రికెట్ క్రీడాకారులు టోర్నీల్లో రాణిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. వేసవికాలంలో క్రికెట్ కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తుండడం అభినందనీయమని అన్నారు. ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, సభ్యులు క్రిష్ణమూర్తి, కోచ్‌లు గోపాలకృష్ణ, ఎండి.మన్నాన్ పాల్గొన్నారు.

మోసపూరిత మాటలు నమ్మొద్దు..



ధన్వాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

ధన్వాడ: ప్రతి పక్షాల మోసపూరిత మాటలను నమ్మకుండా కాంగ్రెస్ హస్తం గుర్తుకు ఓటేసి ఎంపీ అభ్యర్థి వంశీంద్‌రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్ షోలో ఆమె మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధిలో ధన్వాడకు ముందు ప్రాధాన్యత ఇస్తానని.. పుట్టిన గడ్డ నుంచి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

నారాయణపేట: దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేసిన ఇండియా కూటమిని బలపర్చావాల్సిన అవసరం ఉందని.. ఎంపీ అభ్యర్థి వంశీ చంద్‌రెడ్డి గెలుపునకు కృషిచేస్తామని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు కాశీనాథ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమ పట్టించుకుని బీజేపీ అభ్యర్థులను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలన్నారు. నాయకులు ఖతాల్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీని ఓడించాలి..

బీజేపీని ఓడించాలని దేశ సమగ్రత సమైక్యత కోసం పాటు పడుతామంటున్న కాంగ్రెస్ ఇండియా కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బాల్‌రాం ప్రజలను కోరారు. శనివారం మండల పరిధిలోని బొమ్మనుపాడులో సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేసి మాట్లాడారు.. ఒగ్గు బాలప్ప, జనార్దన్, శ్రీనివాస్, కనకప్ప, నరసింహ, వెంకటప్ప, పెద్ద రాములు పాల్గొన్నారు.

ఆరెకటికల మద్దతు..

రాష్ట్రంలోని ఆరెకటికల పూర్తి మద్దతుతో రాష్ట్రంలోని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర ఆరెకటిక అభివృద్ధి సంఘం భూంపల్లి అశోక్‌జీ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీవీఆర్ భవన్‌లో ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డిని కలిసి ఆరెకటికల సంఘం మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు భీజాపూర్ ఖాజారాంజీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాంద్రె రవి కిరణ్‌జీ, జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ, కన్వీనర్ కర్నెకోట నరేందర్‌జీ, జిల్లా సంఘం నేతలు షేక్‌పల్లి మహేందర్‌జీ, పట్టణ అధ్యక్షుడు మాంద్రే లింగేశ్వర్‌జీ పాల్గొన్నారు.

మక్తల్: ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి విజయం ఖాయమని మాజీ మార్కెట్ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు అన్నారు. శనివారం కాంగ్రెస్ తరఫున ప్రచారం చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేసి హస్తం గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మమ్మ, మాజీ ఎంపీటీసీ నవరప్ప, డైరెక్టర్ ఘనపురం వెంకటప్ప, అటో చంద్రప్ప, అంజప్ప, ఈడిగి వెంకటేష్, ఎల్లప్ప, లక్ష్మన్నపాల్గొన్నారు.

మరికల్: కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని శనివారం మండలంలోని కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వంశీచంద్‌రెడ్డి విజయం సాధిస్తే జిల్లా అభివృద్ధి చెందుతుందని మండల అధ్యక్షుడు వీరన్న అన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, సూర్యమోహన్, రామకృష్ణ, హరీష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

మక్తల్: పట్టణంలో మక్తల్ చెందిన గోపాల్, రుద్రసముద్రం గ్రామానికి చెందిన మైనార్టీ నాయకుడు హూస్సేన్ పాషతోపాటు మరికొంత మంది బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారిని కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్‌కుమార్, కె.శ్రీహరి, ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ కోళ్ల వెంకటేష్ వాకిటి శ్యాం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయం కోసం కృషి



మక్తల్: ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి గెలుపునకు కార్యకర్తలు కృషిచేయాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం మండలంలోని చిట్యాలలో హర్‌ఘూవ్ – ఏక్ గంటి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీగెలుపునకు అందరు కలిసి కట్టుగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీ రాంలింగం, గణేష్‌కుమార్, ఆంజనేయులుగౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి

ఊట్కూరు: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం మండలంలోని ఉర్దుభవనంలో ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం సంక్షేమానికి కట్టుబడి ఉందని అన్నారు. జలందర్‌రెడ్డి, ఎల్కోటి జనార్దన్‌రెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, డా. లియాకత్‌అలీ, మున్నూర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కాశీనాథ్